


26 కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. 26 కేంద్రాల్లో మొత్తం 9926 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో ఏ చిన్న ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్రతి కేంద్రం వద్దా కోవిడ్ థర్మల్ స్క్రీనింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలన్నారు. వికలాంగ విద్యార్థుల కోసం స్క్రైబ్‌ల ఎంపిక విషయంలో ఏపీపీఎస్సీ నూతన నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ అపరంజిని, సెక్షన్ ఆఫీసర్లు, జయశ్రీ, భారతి పాల్గొన్నారు.

ఇద్దరు సభ్యులు మినహా తక్కిన అందరూ అధికార పక్షమే ఉన్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యల ప్రస్తావన ఏ మేరకు వస్తుందో చూడాల్సి ఉంది. నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ భవనంలో జరగనుంది. ఈ సమావేశానికి అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు , ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. అంతా అధికారబలమేవున్న ఈ సమావేశంలో సమస్యల ప్రస్తావన ఏ మేరకు రానున్నాయన్నది నేడు జరిగే సమావేశంలో చూడాల్సి ఉంది.





సమస్యలు చర్చకొచ్చేనా..?

- ◆ సాయం కోసం రైతుల ఎదురుచూపు
- ◆ ఇళ్ల లబ్ధిదారులను వెంటాడుతున్న కష్టాలు
- ◆ నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- ◆ హాజరుకానున్న రెండు జిల్లాల అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ సంబంధమైన సమస్యలు అధికంగానున్నాయి. ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూసే రైతులు ఈసారి అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ అధిక వర్షాలు రైతులను తీవ్ర నష్టాలపాలుజేశాయి. రెండు జిల్లాల పరిధిలో ఈ ఏడాది 16 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో పది లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. రెండు లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. మరో 70 వేల ఎకరాల్లో మిరప సాగైంది. ప్రధాన పంట వేరుశనగ దిగుబడి ఆశించినంత రాలేదు. పత్తి, మిరప పంటలకు తెగుళ్లు, నాసిరకం విత్తనాలు రైతులను నట్టేట ముంచాయి. తెగుళ్ల దెబ్బకు దిగుబడులూ తగ్గాయి. ఇంత భారీ నష్టాన్ని చవిచూసినా రైతుకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు సాయం అందుతుందన్నది ఇప్పటి వరకు స్పష్టతలేదు. ఈ సర్వసభ్య సమావేశంలోనైనా రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం జరుగుతుందా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది.

ముందుకొచ్చిన ఇళ్ల స్థలాల సమస్య

రెండు జిల్లాల పరిధిలోనూ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా ముందుకొచ్చాయి. లక్షకుపైగా ఇళ్లు మంజూరైనా రెండు జిల్లాలోనూ కలిపి ఇప్పటికి నిర్మాణం పూర్తయినవి పది శాతంలోపే ఉంటున్నాయి. ఇప్పటికే లేఅవుట్లలో మౌలిక సదుపాయల కల్పన పూర్తవలేదు. ఇక స్థలముండి ఇంటి పట్టాలేని వారికి వెంటనే ఇస్తామని ప్రభుత్వమిచ్చిన హామీనూ ఇంత వరకు అమలు జరగలేదు. ఉరవకొండ, అనంతపురం, కల్లూరు, తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇంటి పట్టాలపై లబ్ధిదారుల్లోనూ ఆందోళన నెలకొంది.

సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే..

గడిచిన మూడేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో ఆయకట్టు రైతులకు అదనంగా పొందుతున్న ప్రయోజనం ఏమీ ఉండటం లేదు. పూర్తి చేస్తామన్న హంద్రీనీవా వెడల్పు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలు ఆగిపోయాయి. హెచ్ఎల్‌సి ఆధునీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కనీసం మరమ్మతకులకు సైతం హెచ్ఎల్‌సి నోచుకోవడం లేదు. ఇటువంటి అనేక సమస్యలు ప్రధానంగా ఉంటున్నాయి.

పింఛన్ల కోతపై కొనసాగుతున్న గుబులు

రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో పింఛన్లకు సంబంధించి తీసుకున్న చర్యలు గందరగోళం అయోమయంలోకి నెట్టాయి. కొంత మంది తమ అర్హతను నిరూపించుకోవాలంటే నోటీసులు జారీ చేసింది. రెండు జిల్లాల పరిధిలో సుమారు 20 వేల మందికి ఈ రకంగా నోటీసులు అందాయి. దీనిపై పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం కావడంతో తిరిగి పింఛన్లను యథావిధిగా ఇచ్చారు. అయితే ఈ నెలలో వారు తమ అర్హతను నిరూపించుకోవాలని ఆదేశాలున్నట్టు ప్రచారం సాగుతోంది. వీటితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న మరిన్ని సమస్యలపై నేడు జరిగే జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఏమేరకు చర్చిస్తారన్న అంశంపై వేచి చూడాల్సి ఉంది. ప్రజలు మాత్రం ఈ సమావేశంలో అయినా సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ఓ నిర్ణయం తీసుకుంటున్నారన్న గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ఉగాది నాటికి 14 వేల ఇళ్ల నిర్మాణాలు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఉగాది నాటికి జిల్లాలో 14 వేల ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో హౌసింగ్ అంశంపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి నాటికి పేదలందరికీ ఇళ్ళు, ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకాల ద్వారా మంజూరైన ప్రతి ఇంటినీ గ్రౌండింగ్ చేసేలా చూడాలన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీలలో విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులు, ఇసుక-స్టీల్ సరఫరా వంటి విషయాల్లో ఎలాంటి సమస్యలు లేవని నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ కేశవనాయుడు, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నూతన పింఛన్ పత్రాన్ని అందిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పేదలందరికీ ప్రభుత్వ లబ్ధి

మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కుందుర్పి

పేదలందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుందుర్పిలో ఎంపీపీ కమల నాగరాజు అధ్యక్షతన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికీ పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 350 కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇలా పని చేస్తున్నా ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించే కుట్ర చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నూతన పింఛన్లను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి, సింగల్ విండో ఛైర్మన్ వన్నూర్ రెడ్డి, వైస్ ఎంపిపి బిజి.సోమనాథ్, శ్రీలక్ష్మీ అజయ్ బాబు, ఎంపీటీసీ గంగమ్మ హనుమంతరాయుడు, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు రాము, కురుబ సంఘం మండల అధ్యక్షుడు కెపి.గోపాల్‌తో మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎపిఎం నీలమణికి వినతిపత్రం సమర్పిస్తున్న మండల యానిమేటర్లు సంఘం నాయకులు

యానిమేటర్ల తొలగింపు బాధాకరం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో పనిచేస్తున్న గ్రామ యానిమేటర్లను తొలగించడం బాధాకరమని మండల యానిమేటర్ల సంఘం నాయకులు ఖండించారు. శుక్రవారం స్థానిక ఐకెపి కార్యాలయం యానిమేటర్లు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది యానిమేటర్లు 20 సంవత్సరాల నుంచి ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం లేకుండానే మహిళలు, ప్రభుత్వ వారధులుగా పనిచేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో వైసిపి ప్రభుత్వం యానిమేటర్లను తొలగించేందుకు జీవో 64 / 11 తీసుకొచ్చిందన్నారు. కావున తక్షణమే జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం ఎపిఎం నీలమణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల యానిమేటర్లు చెన్నకేశవులు, భీమప్ప, తిప్పేస్వామి, ఈశ్వర, ప్రతాప్, రుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, మైక్రో బయాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఏరియా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపాల్‌నాయక్ సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ముఖ్యంగా జ్వరం రెండు, మూడు రోజులైనా తగ్గకపోతే లక్షణాలను బట్టి మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యాకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్, ఫరీసా, కోదండరాములు, రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నారాయణ, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలను జెడ్పీ ఛైర్‌పర్సన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ఎందులోనూ లోటు రానికుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను, మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. తర్వాత మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నీలం భాస్కర్, ఎంపిపి సునీత, ఉప సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, నాయకులు రాధా, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భయపరెడ్డి, మానేరు కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పేదల సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో పెంచిన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున ప్రతి ఒక్కరూ సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. అనంతరం కొత్తగా పింఛను పొందిన 252 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు పద్మలత, వరలక్ష్మి, మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రంగస్వామి, రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గిరిజన పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని సేవాఘడ్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, డార్మెట్రీ, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, కావున ప్రతి ఒక్క విద్యార్థీ చదువుపై దృష్టి సారించి ఉన్నత చదువులు చదివాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల మధ్య ఉన్న అనైక్యతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు చేపడతామని హెచ్చరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఇఒ రవినాయక్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్‌బాషా, సిఐ వెంకటరామిరెడ్డి, బంజారా జాతీయ నాయకులు మల్లికార్జున, పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

సంక్రాంతికీ చక్కెర లేదు..!

రేషన్ షాపుల్లో బియ్యంతో సరి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిచే సరుకులు పేద కుటుంబాలకు ఎంతో ఆసరగా ఉంటాయి. అలాంటి రేషన్ వ్యవస్థ రానురాను నీరుగారిపోతోంది. ప్రస్తుతం రేషన్ షాపుల్లో కేవలం బియ్యాన్ని మాత్రమే ఇస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అయినా చెక్కర, గోధమ పిండి, కందిబేడలు ఇస్తారని ప్రజలు భావించారు. గతంలో సక్రాంతి కానుక పేరుతో రేషన్ షాపుల ద్వారా పలు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసేవారు. ఈ సారి కనీసం చెక్కర కూడా ఇవ్వకుండా బియ్యంతోనే సరిపెడుతున్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పండుగ పూట అయినా చెక్కర ఇవ్వకపోవడం ఏమిటంటూ నిట్టూర్పు విడుస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో పండుగ పూట తినుబండారాలు చేసుకోవడం పేదలకు శక్తికి మించిన పనిగా మారింది. ఇలాంటి సమయంలో నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వార పంపిణీ చేయకుండా ప్రభుత్వం ఇలా చేయడం సరికాదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంక్రాంతి పండుగ నేపథ్యంలో రేషన్‌కార్డు దారులు అందరికీ ఉచితంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రేషన్ బండి వద్ద బియ్యాన్ని తీసుకుంటున్న ప్రజలు

సహజవనరుల సంరక్షణ పనులు ప్రారంభం

రాయదుర్గం రూరల్ : మండలంలోని డి.కొండాపురంలో డబ్ల్యూడిసి స్కీం ద్వారా గ్రామాల్లో చేపట్టబోయే సహజ వనరుల సంరక్షణ పనులను రాయదుర్గం జడ్పిటిసి మల్లికార్జున శుక్రవారం ప్రారంభించారు. సహజ వనరుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని డి.కొండాపురం, టి.వీరాపురం, గ్రామదట్ల వాటర్‌షెడ్ గ్రామాలకు ఎంపికయ్యాయి. దీంతో ప్రభుత్వ నుంచి వచ్చిర రూ.8.9752 కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డి కొండాపురం ప్రాజెక్టులో 3199 హెక్టార్ల విస్తీర్ణానికి ఒక హెక్టారుకు రూ.28 వేల చొప్పున కేటాయించినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి శివప్ప, వైసిపి నాయకులు రామన్న, వాటర్షెడ్ కమిటీ ఛైర్మన్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు, వాటర్‌షెడ్ జెఇ శ్రీరాములు, టిఓఐ, సిబి ఈరన్న, టిఓ విశ్వేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



సహజ వనరుల సంరక్షణ పనులను ప్రారంభిస్తున్న జడ్పిటిసి మల్లికార్జున

వేగవంతంగా ఈ-క్రాప్ బుకింగ్ చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి-ఉరవకొండ

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వేగవంతంగా ఈక్రాప్ బుకింగ్ చేపట్టాలని ఉరవకొండ ఎడిఎ పద్మజ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు వారివారి పరిధిలో ఉన్న రైతులందరికీ వందశాతం ఈ క్రాప్ నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈక్రాప్ బుకింగ్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. లేనిపక్షంలో సబ్సిడీ పథకాలు, అతివృష్టి, అనావృష్టి జరిగినప్పుడు ప్రభుత్వ అందించే సహాయ సహకారాలకు అర్హులవుతారన్నారు. అలాగే పిఎం కిసాన్‌కు అర్హత ఉండే రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పెన్నయ్య, ఎఇఒ రాఘవేంద్ర, గ్రామ అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



సజ్జలకు వినతిపత్రం అందజేస్తున్న అన్‌ఎయిడెడ్ లెక్చరర్లు

సజ్జలను కలిసిన అన్ ఎయిడెడ్ అధ్యాపకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి నాయకత్వంలో అన్ ఎయిడెడ్ లెక్చరర్లు ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. గురువారం తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ యందు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మినిమం టైమ్ స్కేల్‌ను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నగరూరు రసూల్, డాక్టర్ ఓబిరెడ్డి, సాగర్, వెంకటేశ్వర్లు, గోపీచంద్, శివరాం ఉన్నారు.

నార్పల ఎస్ఐగా రాఘవరెడ్డి

నార్పల : నార్పల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా రాఘవరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటప్రసాద్ పుట్లూరు మండలానికి బదిలీ అయ్యారు. దీంతో స్పెషల్ బ్రాంచి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాఘవరెడ్డి నార్పల ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

కెజిబివి పాఠశాల తనిఖీ

శింగనమల : డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి కెజిబివి పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో సిసి కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ శివశంకర్‌రెడ్డి, బంగారు అలీబాషా, భాస్కర్ రెడ్డి, నాగరాజు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవాణి'లో సంక్రాంతి సంబరాలు

అనంతపురం : స్థానిక కక్కలపల్లి కాలనీలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినీలు రంగవల్లులతో కళాశాల ముందు తీర్చిదిద్దారు. విద్యార్థులు అచ్చమైన పంచె కట్టుతో అలరించారు. డాన్సులు, పాటలతో ఆకట్టుకున్నారు. కళాశాలల ప్రిన్సిపల్స్ వనజమ్మ, భాస్కరరెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఉరవకొండ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజిలెన్స్ అధికారులు ఎస్ఐ బాలకృష్ణ, ఎజి.శివప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందుల కాలపరిమితిని, బ్యాచ్ నెంబర్లను పరిశీలించారు. అనంతరం వార్డుల్లోకి వెళ్లి రోగులను విచారించి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు జెవి. శ్రీధర్, రాజేంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

ఎంపీ తలారి రంగయ్య

బెలుగుప్ప : రాజాంగ నిర్మాత అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఎంపీ తలారి రంగయ్య, ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, ఎంపీపీ పెద్దన్న, నాగలింగమయ్య పేర్కొన్నారు. గుడ్లపల్లి క్రాస్ నందు రూ.3 లక్షల నిధులతో అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రిల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని 1994లో ఏర్పాటు చేశారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ శివలింగప్ప, విద్దేకుంట రామాంజనేయులు, రమనేపల్లి రమేష్, కాంట్రాక్టర్ అంజి, నాగేంద్ర, హనుమంతు, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బెలుగుప్ప : యుటిఎఫ్ 2023 క్యాలెండర్, డైరీని స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ కాంప్లెక్స్ నందు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అర్జున్, బెలుగుప్ప మండల గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, మండల అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రఫీ, శంకర్‌రెడ్డి, తులసీరామ్, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వర్థ నారాయణుడి కళ్యాణం

పెద్దపప్పూరు : చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి భవానీ భీమలింగేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు విలువేదీ..?

స్టాండిగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

సచివాలయాలకు వెళ్తే కార్పొరేటర్లకు కనీస గౌరవం దక్కటం లేదని, కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండటం లేదని స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు వాపోయారు. శుక్రవారం మేయర్ మహమ్మద్ అధ్యక్షత స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగమోహన్, కార్యదర్శి శ్రీనివాసులు,హెల్త్ ఆఫీసర్, గంగాధర్ రెడ్డి, ఎసిపి సువర్ణ, రెవెన్యూ ఆఫీసర్లు సతీష్, సుజాత, మెప్మా టిపిఒ విశ్వ జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన కార్పొరేటర్లకు వార్డు సచివాలయాల్లో విలువే లేదన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తాము డివిజన్లలోని సమస్యలను చెబితే కానీ సచివాలయ సిబ్బందికి తెలియడం లేదన్నారు. సచివాలయం రాక మునుపు ఏ సమస్య ఉన్నా ప్రజలు కార్పొరేటర్ల దగ్గరికి వచ్చే వారన్నారు. ఇప్పుడు ఏ సమస్య అయినా సచివాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కావట్లేదు కార్పొరేటర్‌ను కలిస్తే పనులు జరుగుతాయని చెప్పి పంపుతున్నారన్నారు. సచివాలయాల్లో కార్పొరేటర్లకు జవాబుదారీగా ఉండాల్సిన సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటని వారు కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఎక్కడా ప్రస్తావన లేదన్నారు. సభ్యులు అన్నట్లుగా గతంలో సంక్షేమ పథకాలు గాని ఇతర సమస్యలు కానీ ఉంటే కార్పొరేటర్ల సిఫారసు మేరకు జరిగేదన్నారు. దీనిపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజలకు జారీ చేసే సర్టిఫికెట్లకు సంబంధించి కాగితాలు లేవని ప్రింటర్ పనిచేయట్లేదని అని ప్రజలకు చెప్పి పంపుతున్నారన్నారు. వారికి అవసరమైన స్టేషనరీ కొరత లేకుండా సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అద్దెలకు ప్రభుత్వం ప్రతినెలా స్టేషనరీ మరమ్మతులకు కొంత డబ్బు చెల్లిస్తోందన్నారు. ఎక్కడైనా సామగ్రి కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుధ్య సమస్యలు, కార్మికుల కొరత, మున్సిపల్ స్థలాల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశం ఆద్యంతం సభ్యులు పలు అంశాలపై అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యహితంగా ప్రభుత్వ పాలన లేదు..

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'ప్రజలు నిరాశ, నిస్పృహలతో ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. నగరంలో యథేచ్ఛగా ఆక్రమణలు భూకబ్జాలు జరుగుతున్నాయని. ప్రజాస్వామ్య యుతంగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన నడవడం లేదు'..అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. శుక్రవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రతిపక్షాన్ని అణగదొక్కాలని చూస్తున్నారని తెలిపారు. అనేకమార్లు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండని, నగరంలో 50 వేల ఎకరాలు తీసుకొని 6 వేల గృహాలు పూర్తిగా ప్రజల సొమ్ముతో 60 శాతం పూర్తి చేశామన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీ లేకుండా పాడుబడి ఉన్నాయని తెలిపారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రజలలో నిరాశ కనిపిస్తోందన్నారు. ఎక్కడికెళ్లినా ప్రజలు సమస్యలు ఏకరువు పెడుతున్నారని తెలిపారు. పింఛన్లు తీసేయడం, రేషన్ కార్డులు తొలగించడం వంటివి చేశారన్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు తప్పులు ఎత్తి చూపుతూ సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటేలా పెరిగి ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ఆదుకోవాల్సింది పోయి పన్నులు పెంపుదల చేసి భారాలు మోపుతున్నారని తెలిపారు. నగరంలో రూ.200 కోట్ల విలువ చేసే ఒకటిన్నర ఎకరా స్థలాన్ని వైఎస్ఆర్‌సిపి కార్యాలయానికి కేటాయించారని, ఎప్పుడూ నీతులు చెప్పే ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఇది నీకు కనపడలేదా అని ప్రశ్నించారు. జిల్లాలో పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేసిన ఫాదర్ ఫెర్రర్ గొప్ప వ్యక్తి విగ్రహం తీసివేయడం దారుణం కాదా అన్నారు. రాష్ట్రంలో సైకో ప్రభుత్వం కొనసాగుతోందని, కుప్పంలో నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. చీకటి జీవోలు తీసుకు వచ్చి ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్నారని, అధికారం శాశ్వతం కాదని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

అనంతలో క్రెడాయి ప్రాపర్టీ షో ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన వివిద సంస్థలతో ఏర్పాటైన క్రెడాయి ప్రాపర్టీ షో అనంతపురం నగరంలో ప్రారంభమైంది. స్థానిక రాంనగర్ లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన షోను అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య, అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రియలెస్టేట్ అపెక్స్, మహతి, అక్షయ, ఎస్వీఆర్ఫ్, స్కంధాన్ సి నిర్మాణ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపి, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రధాన నగరాలకు అనంతపురం సెంటర్ పాయింట్‌గా ఉందన్నారు. మధ్యతరగతి ప్రజలకు అనువుగా ఉండే అధునాతన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని క్రెడాయి సభ్యులను కోరారు. మూడు రోజులపాటు ప్రదర్శన ఉంటుందని అనంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రెడాయి సభ్యులు తిరుపాల్, చంద్రశేఖర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తే లక్ష్యంగా విద్యనభ్యసించాలి

మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్ గుప్తా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి విద్యార్థీ పారిశ్రామికవేత్త అవ్వాలనే సంకల్పంతో విద్యను అభ్యసించాలని పారిశ్రామికవేత్త, మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్ గుప్తా పేర్కొన్నారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ, ఎంసీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కళాశాల యాజమాన్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు అధికంగా ఉండడం వల్లే పలు దేశాలు అభివృద్ధి చెందాయని అన్నారు. విద్యార్థులు బాగా చదివి పారిశ్రామికవేత్తలు అయి పరిశ్రమలు స్థాపించి పలువురికి ఉద్యోగాలు కల్పించడంతోపాటు దేశ అభివద్ధికి తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను కళాశాల యాజమాన్యం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ వికె.శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, ఎంబిఎ విభాగాధిపతి నాగప్రభాకర్ పాల్గొన్నారు.

చీకటి జీవోను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

రాజకీయ దురుద్దేశంతో వైసిపి ప్రభుత్వం ర్యాలీలు, బహిరంగ సభలపై ఆంక్షలు పెడుతూ తెచ్చిన చీకటి జిఒ1 ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. జిఒ1 ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో 8 మంది మరణించారని, గుంటూరు జిల్లాలో టిడిపి ఎన్నారైలు పంచుతున్న కానుకలలో ముగ్గురు మరణించారని సాకుగా తీసుకొని బహిరంగ ప్రదేశాలలో ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని నిషేధిస్తూ వైసిపి ప్రభుత్వం తెచ్చిన జిఒ అప్రజాస్వామికం అన్నారు. ప్రశ్నించే గొంతులు నొక్కేందుకే జగన్ రెడ్డి ప్రభుత్వం చీకటి జిఒ తెచ్చిందన్నారు. ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి డివిజన్ కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు సత్తార్, పిడిఎస్‌యు పట్టణ కార్యదర్శి తరుణ్, బీమా, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, రామంజి, గోపికృష్ణ, జానయ్య, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు మెడికోల ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొనబోతున్న 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్ ఈనెల 12 నుంచి 16 వరకు భారతదేశ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రంలోని హుబ్లీలోని ధార్వాడ్‌లో జరగనుంది. ఈ యూత్ ఫెస్టివల్‌కు డాక్టర్ వైసిపి ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి 12 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. అందులో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన 2022వ బ్యాచ్‌కు చెందిన మెడికోలు ఎజి.పరిణిత సాయి, బండి పావని, కె.మహేంద్ర, ఎం.సునత్ పవన్ లు ఎంపికయ్యారు. వారిని ఎంపిక చేసినందుకు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ పిగిలం శ్యాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కత్తిమణి వివేకానందకు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నీరజ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఆర్‌జెడి



విద్యార్థితో మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యాశాఖ కడప ఆర్‌జెడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం అనంతపురం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ (బాలురు), శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు నిర్వహణ తీరు, విద్యార్థులు జవాబులు రాస్తున్న విధానం, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ పరిశీలించారు. స్టడీ అవర్స్‌లో ఉన్న తరగతులను పరిశీలించి విద్యార్థులు చదువుచున్న నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ ను ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా కరెక్షన్స్ చేశారా? లేదా? అని పరిశీలించారు. మంచి దస్తూరితో నోట్స్ రాసుకుని చదువుతున్న విద్యార్థిని అభినందించి నోట్ బుక్‌లో ఆర్‌జెడి స్వయంగా సంతకం చేశారు. పాఠశాలల్లో నాడు నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి బెంచిపైన కూర్చొని పరీక్ష రాసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రశ్నపత్రం పైన, ప్రశ్నలకు జవాబులు రాసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా లెసన్ ప్లాన్, టీచర్ డైరీ రాయాలని, తరగతి గది, పాఠశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకటస్వామి, డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వర్ రెడ్డి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం కొర్రపాడు పాఠశాలను ఆర్‌జెడి శుక్రవారం విజిట్ చేశారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ యూనిఫాం వేసుకున్నందుకు అభినందించాడు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ రామకృష్ణ, ఇఇ శివకుమార్, ఎంఇఒ గురుప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్, శ్యామలాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం నూతనంగా మంజూరు అయిన పింఛన్లతోపాటు, పెంచిన పింఛన్ల సొమ్మును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ జగన్మోహన్‌రెడ్డిని భవిష్యత్తులో ఆదరించాలన్నారు. సీఎం ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు ముందుకు సాగేలా ఆశీర్వదించాలన్నారు. అనంతరం కొత్తగా పింఛను పొందిన 252 మంది లబ్ధిదారులకు పింఛను మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు పద్మలత, వరలక్ష్మి, మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రంగస్వామి, రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలో కొత్తగా మంజూరైన 208 పింఛన్లను లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. మండల అధ్యక్షులు రామూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు బొందలదిన్నె, రామయ్య జడ్పిటిసి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు, పింఛను లబ్ధిదారులు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి -అనంతపురం

నగరంలోని 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం చేపట్టారు. శుక్రవారం ఉదయం 47వ డివిజన్‌లో కార్పొరేటర్ మల్లెల దుర్గాదేవి తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్లను ప్రతి ఇంటికీ అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం తమదని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు : రంగంపేట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి తెలియజేశారు. బ్రోచర్లు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉజ్జినప్ప, మండల అధ్యక్షురాలు సుబ్ర హేమలత, ఎంపిటిసి విజయ్, దిబ్బ చంద్రశేఖర్ రెడ్డి, రాధికా రెడ్డి, వాసుదేవరెడ్డి, బాల పోతన్, ఎంపీడీవో కొండన్న, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే కుట్ర రాజకీయాలు

మేయర్ మొహమ్మద్ వసీం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో కొంతమంది నేతలు పనిగట్టుకొని విగ్రహాల పేరిట ఉనికి కోసం కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని మేయర్ వసీం ధ్వజమెత్తారు. శుక్రవారం మేయర్ చాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్‌తోపాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఇషాక్, శ్రీనివాసులు, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ఏర్పాటు పేరుతో నీచ రాజకీయాలకు పాల్పడటం సరికాదన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారిలో భాగంగా తొలగించిన విగ్రహాలన్నీ భద్రపరిచారన్నారు. ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. అయితే మరో నేత వెంకట్‌రెడ్డి విగ్రహం అంశంపై టిడిపి నేత చేసిన విమర్శలు సరికాదన్నారు. ఆయన వివిధ హోదాల్లో ప్రజలకు సేవలు అందించారన్నారు. ఈ విషయాలు తెలిసి కూడా సదరు నేతను విమర్శించడం సరికాదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తాము చేసినట్లుగా చెప్పుకోవడం ఆ నేతకు రివాజుగా మారిందన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి అభివృద్ధి పనీ తనదిగా చెప్పుకునే ఆ నేత వైఖరి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో చేస్తున్న అభివృద్ధి పనులకు సంబంధించి జాబితాను చూస్తే అర్థమవుతుందన్నారు. తాము చేయలేని అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం చేస్తుంటే జీర్ణించుకోలేక అదేపనిగా విమర్శలు చేసే ఆ నేతకు ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ఆయన తన వైఖరి మార్చుకోవాలని సూచించారు.

దాతలు సహకరిస్తే ఎవరెస్టును ఎక్కేస్తా

పర్వతారోహకుడు ఉపేంద్ర

అనంతపురం : దాతలు సహకరిస్తే ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కేస్తానని పర్వతారోహణలో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థి ఉపేంద్ర పేర్కొన్నారు. పర్వతారోహకుడు ఉపేంద్ర జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్‌ని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర టిసి.వరుణ్‌తో మాట్లాడుతూ.. అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివే సమయంలో తనకు పర్వతాలను అధిరోహించే అవకాశం వచ్చిందన్నారు. కళాశాల నుంచి 25 మందిని ఎంపిక చేశారన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మొత్తం 130 మందిని రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశారన్నారు. తుది జాబితా 25 మందిలో తానూ నిలిచానని చెప్పారు. పర్వతారోహణకు చాలా డబ్బులు అవసరం అవుతాయని ఉపేంద్ర పేర్కొన్నారు. మాది పేద కుటుంబమైనా పట్టుదలతో పర్వతాలను అధిరోహించానన్నారు. ఎన్నో ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నానని చెప్పారు. స్పందించిన వరుణ్ ప్రతిభను ప్రోత్సహించడంలో జనసేన పార్టీ ముందుంటుందన్నారు. సాయం చేస్తుందని భరోసా కల్పించారు. అనంతరం ఉపేంద్రను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు, అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు కిరణ్ కుమార్, పురుషోత్తం రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శులు ఇమామ్, హుస్సేన్ పాల్గొన్నారు.



ఉపేంద్రను సత్కరిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ తదితరులు

సాగులో మెలకువలు పాటించాలి

ఉరవకొండ : వ్యవసాయ సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఉరవకొండ వ్యవసాయ అధికారి శశికళ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. రైతుల ఆత్మహత్యలు జరగకుండా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం జీవన రేఖ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా 9490900800, 08554 -297328 నెంబర్లను సంప్రదించాలన్నారు. రైతులు వీలైనంత తొందరలో ఈకేవైసీ పూర్తి చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ లోపు పిఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఉరవకొండ, రేణుమాకుల పల్లిలో ఈ క్రాప్ పంట నమోదును పరిశీలించారు. సిరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అక్షిత, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ఆర్‌బికె కేంద్రం నందు వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్, ఎంపిపి సుబ్బర హేమలత, సర్పంచి వరలక్ష్మి, ఎఇఒ సుజిత, విఎస్ఎ భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం : శుక్రవారం ఇటుకలపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ మండలి సమావేశం ఏవో వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అలమూరు సుబ్బారెడ్డి ఇటుకలపల్లి సర్పంచి భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వైసీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, ఎంపీఈవో అపర్ణ పాల్గొన్నారు.

తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలి

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-గుత్తి

తుగ్లక్ లా వ్యవహరిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చమర గీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏపీ అని అన్నారు. రాజధాని లేకుండా పరిపాలన సాగించడం శోచనీయమన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామ సర్పంచుల నిధులను జగన్ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. గతంలో నిధులు కేటాయించి అన్ని వర్గాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు తోడ్పాటును అందించారన్నారు. రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు పరిపాలన కొనసాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అనిల్ గౌడ్, మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్ గౌడ్, నాయకులు మోడే శ్రీనివాస్ యాదవ్, గోవర్ధన్ గౌడ్, తిమ్మప్ప, సుధీర్ గౌడ్, రామకృష్ణ, అగ్గిరాముడు, టౌన్ బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ జిలానీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.